పీఎస్‌-4తో విభిన్న ప్రయోగాలు

సూళ్లూరుపేట: సతీష్‌ ధవన్‌ స్పేస్‌ సెంటర్‌ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి సోమవారం రాత్రి 9.58 గంటలకు ప్రయోగించనున్న పీఎస్‌ఎల్‌వీ సీ60 ప్రయోగంలో పీఎస్‌-4 అర్బిటల్‌ ఎక్స్‌పెరమెంట్‌ మాడ్యూల్‌ దశతో విభిన్న పరిశోధనలను చేసేందుకు ఇస్రో సిద్ధమవుతోంది. రాకెట్‌లోని శిఖర భాగంలో అమర్చే పీఎస్‌-4 ఆర్బిటల్‌ ఎక్స్‌పెరమెంట్‌ మాడ్యూల్‌లో 24 పేలోడ్స్‌ (ఉపకరణాలు) అమర్చి పంపిస్తున్నారు. ఇందులో 14 పేలోడ్స్‌ ఇస్రోకి సంబంధించినవి కాగా 10 పేలోడ్స్‌ ప్రభుత్వేతర స్టార్టప్‌ కంపెనీల వారు సమకూర్చారు. పీఎస్‌-4 ఆర్బిటల్‌ ఎక్స్‌పెరమెంట్‌ మాడ్యూల్‌ మూడు నెలలు పాటు నిర్ధిష్ట కక్ష్యలో ఉండి మైక్రోగ్రావిటీ ప్రయోగాలకు ఉపయోగపడేలా చేస్తుంది. పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌లలో పీఎస్‌-4 ఆర్బిటల్‌ ఎక్స్‌పెరమెంట్‌ మాడ్యూల్‌లో ఇది నాలుగో ప్రయోగమని ఇస్రో తెలియజేసింది. రాకెట్‌లోని నాలుగో దశలో అమర్చే ఉపగ్రహాన్ని నిర్ధిష్టమైన కక్ష్యలోకి ప్రవేశపెట్టిన 1.59 గంటల తరువాత పీఎస్‌-4ను మండించి అనేక ఎక్స్‌పెరమెంట్‌ చేయడానికి ఈ టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నారు. పీఎస్‌-4లో అమర్చిన పేలోడ్స్‌ను ఒక్కొక్కటిగా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు

డెబ్రిస్‌ క్యాప్చర్‌ రోబోటిక్‌

ఈ డెబ్రిస్‌ క్యాప్చర్‌ రోబోటిక్‌ ద్వారా విజువల్‌ సర్వోయింగ్‌, ఆబ్జెక్ట్‌ మోషన్‌ పిడిక్షన్‌ ద్వారా అంతరిక్ష వాతావరణంలో రోబోటిక్‌ చేయడం వంటి పరిశోధనలు చేస్తుంది.

లీడ్‌ ఎక్స్‌ప్లో ఎక్స్‌పెరమెంట్‌ సిస్టం

ఈ పేలోడ్‌ ద్వారా సీసం రహిత భాగాలను ఉపయోగించి ప్యాకేజీని గ్రహించడం, స్పేస్‌ అపరేషన్‌ను నిర్ధారించి విశ్వసనీయతను అంచనా వేయడం వంటి పరిశోధనలు చేస్తుంది.

మెమ్స్‌ బేస్డ్‌ రేట్‌ సెన్సార్‌

అంతరిక్షంలో సెన్సార్లు ఎలా పనిచేస్తున్నాయి. 3-యాక్సిస్‌ కోణీయ రేట్‌లను కొలిచి దీని ప్రవర్తనను అధ్యయనం చేస్తుంది.

కంపాక్ట్‌ రీసెర్చ్‌ మాడ్యూల్‌ ఫర్‌ ఆర్బిటర్‌ ప్లాంట్‌ స్టడీస్‌

మల్టీ ఫేజ్‌ ఆటోమేటెడ్‌ పొందేందుకు విత్తనాల అంకురోత్పత్తిని సాధించగల సామర్థ్యం, మైక్రోగ్రావిటీలో రెండు ఆకుల దశ వరకు మొక్కల పోషణ లాంటి అంశాలను తెలియజేస్తుంది.

మల్టీ సెన్సార్‌ ఇనర్షియల్‌ రెఫెరెన్స్‌ సిస్టం

ఇందులో జడత్వ సెన్సార్లు, అధునాతన జియోమాగ్నెటిక్‌ సెన్సార్లు ద్వారా సూక్ష్మీకరించి పనితీరును అంచనావేసి తెలియజేస్తుంది.

రీలోకేటబుల్‌ రోబోటిక్‌ మ్యానుపులేటర్‌

ఈ పేలోడ్‌ ఒక అంగుళం వ్యాసార్థం కలిగిన తిరిగిన స్థానాన్ని ప్రదర్శించి దాని గురించి అధ్యయనం చేస్తుంది. గ్రాప్లింగ్‌ కోసం లూప్‌ రోబోటిక్‌ ఆర్మ్‌ ఆపరేషన్‌లో ఏ1 ఆధారిత దృశ్యాన్ని తనిఖీ చేస్తుంది.

రియాక్షన్‌ వీల్‌ అసెంబ్లీ

పీఎస్‌ఎల్‌వీ ఆర్బిటల్‌ ఎక్స్‌పెరమెంట్‌ మాడ్యూల్‌ (పీఓఈఎమ్‌) ప్లాట్‌ఫారమ్‌ వైఖరి స్థిరీకరణను అధ్యయనం చేయడానికి ఉపయోగించనున్నారు.

లాసర్‌ ఫైరింగ్‌ యూనిట్‌

ఈ పేలోడ్‌ లేజర్‌ ఇన్షియేటెడ్‌ పరికరం, లేజర్‌ ఇన్షియేటెడ్‌ పైరో థ్రస్టర్‌లను ఉపయోగించి లేజర్‌ టెక్నాలజీని అభివృద్ధి చేస్తుంది.

ఎల్‌పీ వీ2-3 సంఖ్యలు

ఈ పేలోడ్‌ కక్ష్యలో ఎలక్ట్రాన్‌ సాంద్రతను కొలవడం, మూడింటితో సంపూర్ణ ఎలక్ట్రాన్‌ సాంద్రతను అంచనా వేయడం, స్థూపాకారం ఎల్‌పీని సూచించడం వంటి పరిశోధనలు చేస్తుంది.

ఎన్వీపీ-2

ఈ పేలోడ్‌తో ఎలక్ట్రాన్‌ సాంద్రత, గాలి ప్రోబ్‌ రెండు లంబంగా ఆయాన్‌ డ్రీఫ్ట్‌ కొలత, కక్ష్య వెంట దిశలు అనే అంశాలపై అధ్యయనం చేస్తుంది.

ఎలక్ట్రాన్‌ టెంపరేచర్‌ అధ్యయనం

ఈ పేలోడ్‌ విశ్వంలో గ్రహాల అయనోస్పియర్‌ ఎలక్ట్రాన్‌ సాంద్రతను అధ్యయనం చేస్తుంది.

పేలోడ్‌ కామన్‌ ఆన్‌బోర్డ్‌ కంప్యూటర్‌

ప్రత్యేక పేలోడ్‌ల కోసం సాధారణ నియంత్రణ కోసం ఇది అధ్యయనం చేస్తుంది.

ప్లాస్మారిక్‌ సాంద్రత కొలత

ఈ పేలోడ్‌తో ప్లాస్మారిక్‌ ఎలక్ట్రానిక్‌ కంటెంట్‌ ఆధారంగా కొలతలు తీయడం, నావిక్‌ రిసీవర్‌ ఆన్‌బోర్డు పీఓఈఎంలో భారతీయ ప్రాంతీయ కవరేజీ చేయడం వంటి పనులు చేస్తుంది.

పైలెట్‌- జీ2

ఈ పేలోడ్‌తో ఇంతకుముందు అభివృద్ధి చేసిన క్యూబ్‌శాట్‌ యూహెచ్‌ఎఫ్‌ బోర్డు గీగర్‌-ముల్లర్‌ కౌంటర్‌ పేలోడ్‌ల కొలత, రేడియేషన్లు, ఇన్‌ ఆర్బిట్‌ ప్రోగ్రామ్‌ వంటి అంశాలను అధ్యయనం చేస్తుంది.

గెలాక్సీ ఐ స్పేస్‌

ఈ పేలోడ్‌తో సింథటిక్‌ అపార్చర్‌ రాడార్‌తో ఛాయాచిత్రాలు తీయడం, అంతరిక్ష పరిసరాల్లో డీఏసీ, ఏడీసీ కచ్చితత్వాన్ని తెలియజేస్తుంది.

బీజీఎస్‌ ఆర్బిట్‌

ఎస్‌జేసీ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ వారు తయారు చేసిన బీజీఎస్‌ అర్బిట్‌ మల్టీమోడ్‌ సందేశ ట్రాన్స్‌మీటర్‌ ఆడియో, టెక్ట్స్‌ ఇమేజ్‌ సందేశాలను ప్రసారం చేస్తుంది. ఎఫ్‌ఎం మాడ్యులేషన్‌ ఉపయోగించి వీహెచ్‌ఎఫ్‌ బాండ్‌ ద్వారా ఉపగ్రహం నుంచి భూమికి అందిస్తుంది.

బెల్లాట్రిక్స్‌ ఏరోస్పేస్‌ రుద్ర 1.0 హెచ్‌పీజీపీ

ఈ పేలోడ్‌ ద్వారా హై పర్ఫార్మెన్స్‌ గ్రీన్‌ ప్రొపల్షన్‌ వ్యవస్థ, ప్రొపల్షన్‌ థర్మల్‌ ప్రొఫైల్‌ను పర్యవేక్షించే వ్యవస్థను తయారు చేసుకోవడం వంటివి అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

ఆర్‌వీ శాట్‌-1- ఆర్‌వీ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ వారు ఆర్‌వీ శాట్‌-1ను రూపొందించారు. మైక్రో బయోలాజికల్‌ ప్రయోగం చేయడమే లక్ష్యంగా రూపొందించారు. తక్కువ భూకక్ష్యలో వుండి మైక్రో గ్రావిటీని తెలియజేస్తుంది.

మెమ్స్‌

ఈ పేలోడ్‌తో ఏవియానిక్స్‌ను పరీక్షించేందుకు ఉపయోగపడుతుంది.

వరుణ

ఈ పేలోడ్‌ ద్వారా అంతరిక్షంలో ఆటోమేటెడ్‌ కోసం బేస్‌ బ్యాండ్‌ ఎలక్ట్రానిక్‌లను పరీక్షించడం, రిఫ్లెక్ట్‌-ఆరే యాంటెన్నా విస్తరణను పరీంచుకోవడం లాంటి అంశాలను అధ్యయనం చేస్తుంది.

మనస్తు స్పేస్‌ వ్యోమ్‌-2యూ


మోనోప్రొపల్లెంట్‌ హైడ్రోజన్‌ మిశ్రమంగా రూపొందించారు. పెరాక్సైడ్‌ సంకలనాలతో రూపొందించారు. సురక్షితంగా అధిక పనితీరును అందించే లక్ష్యంగా అంతరిక్ష అనువర్తనాల కోసం హైడ్రోజన్‌కు ప్రత్యామ్నాయాన్ని కనుగొనడం.

అపెమ్స్‌

అమిటీ యూనివర్సిటీ వారు దీన్ని రూపొందించారు. మొక్కల కాలిస్‌ పెరుగుదల సంబంధిత మార్పుల అధ్యయనం మైక్రోగ్రావిటీ కింద స్పినాసియా ఒలేరేసియా మోడల్‌తో భూమి గురుత్వాకర్షణ శక్తి పర్యవేక్షిస్తుంది.

స్వేచ్ఛశాట్‌

ఎన్‌ స్పేస్‌ టెక్‌ ఈ బుల్లి ఉపగ్రహాన్ని తయారు చేశారు. తెనాలికి చెందిన సాయిదివ్య అనే విద్యార్థిని తయారు చేసుకున్నారు. కమ్యూనికేషన్‌ లింక్‌ ఏర్పాటు చేయడం, యూహెచ్‌ఎఫ్‌ ట్రాన్స్‌మీటర్‌ సామర్థ్యం తెలుసుకుని వ్యవసాయరంగానికి మెరుగైన సేవలను అందించనున్నారు.



పీఎస్‌ఎల్‌వీ నాలుగో దశలో పీఎస్‌-4లో అమర్చిన 24 పేలోడ్స్‌ ఇవి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



చెంచుబాబు, డీఎస్పీ

నాయుడుపేటటౌన్‌ : నూతన సంవత్సర వేడుకల పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. పట్టణంలోని డివిజన్‌ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీ మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్పెషల్‌ డ్రైవ్‌లు చేపట్టి ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు వెల్లడించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని జనాలు ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండరాదని 144 సెక్షన్‌ అమల్లో ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ వాహనాలు, నడుపుతూ పట్టుబడితే జైలు శిక్ష పడుతుందన్నారు. నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాలతో పాటు జాతీయ రహదారి కూడలి ప్రాంతాల్లో పోలీసుల పహారా ఉంటుందని తెలిపారు. పోలీసులకు సహకరించి నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు.

31వ తేదీ రాత్రి పోలీస్‌ పికెట్‌

వెంకటగిరి(సైదాపురం): నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని డిసెంబర్‌ 31వ తేదీ రాత్రి అంతా వెంకటగిరి సర్కిల్‌ పరిధిలో పోలీస్‌ పికెట్‌ ఏర్పాటు చేయనున్నట్లు సీఐ ఏవీ రమణ అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ 31వ తేదీ రాత్రి పట్టణం, పరిసర ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. వైన్‌షాపులు, బార్లు నిర్దేశించిన సమయంలో మూసివేయాలన్నారు. రాత్రి సమయంలో హోటళ్లు, ఫంక్షన్‌హాల్‌ నిర్వహణకు ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలని చెప్పారు.

క్లుప్తంగా

అనుమతి తప్పనిసరి

-గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్‌



మాట్లాడుతున్న డీఎస్పీ రమణకుమార్‌

చిల్లకూరు: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎక్కడైనా ప్రైవేట్‌ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించే వాటికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్‌ తెలిపారు. గూడూరులోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలకు సంబంధించిన నియమ నిబంధనలపై విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను కుటుంబసభ్యులతో కలసి ఆహ్లాదకరంగా జరుపుకోవాలన్నారు. అలా కాకుండా యువత నడి రోడ్డుపై కేక్‌ కటింగ్‌ చేయడం, పెద్ద పెద్ద శబ్దాలతో బైక్‌లను నడపడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్‌గా వేడుకలను నిర్వహించుకోవాలంటే అనుమతి తీసుకోవాలని అన్నారు. గూడూరు ఒకటవ, రెండవ పట్టణ సీఐల తోపాటు రూరల్‌ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాసులు, కిశోర్‌బాబు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతినిధులు

చిల్లకూరు: మండల కేంద్రంలోని దళితవాడకు చెందిన శంకరమ్మ అనే ఓ వృద్ధురాలు ఆదివారం మృతిచెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో గ్రామస్తులు ముందుకొచ్చారు. విషయం తెలిసి చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్‌ ట్రస్టు నిర్వాహకులు శ్రీనివాసులు ట్రస్టు ద్వారా తమ ప్రతినిధులతో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు ప్రతినిధి మస్తాన్‌ పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ



కొత్త దుస్తులు పంపిణీ చేస్తున్న నేతలు

చిల్లకూరు: స్థానిక శారదానగర్‌లో నివసించే గిరిజన కుటుంబాలకు నూతన దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. చిల్లకూరుకు చెందిన పీపుల్స్‌ వెల్ఫేర్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌ ట్రస్టు నిర్వాహకులు పోతుగుంట మల్లికార్జున్‌ మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంకాంత్రి పండుగ సందర్భంగా పంపిణీ చేశామని తెలిపారు. నేతలు రామచంద్రారెడ్డి, బెల్లంకొండ రాజా, మధు, సురేస్‌, రమణయ్య, ట్రస్టు ప్రతినిధులు విజయమ్మ, శంకర్‌, పాల్గొన్నారు.


యూటీఎఫ్‌ మహాసభలకు తరలిరండి



సభలు విజయవంతం చేయాలని ప్రచార జాత

నాయుడుపేటటౌన్‌ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జనవరి 5, 6,7,8 తేదీల్లో జరిగే యూటీఎఫ్‌ విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు తరలి రావాలని ఆ సంఘ రాష్ట్ర నాయకులు కోరారు. యూటీఎఫ్‌ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార జాతా ఆదివారం నాయుడుపేటకు చేరుకుంది. కార్యక్రమంలో యూటీఎఫ్‌ రాష్ట్ర, జిల్లా, డివిజన్‌ పరిధిలోని నాయకులు రాజశేఖర్‌ రెడ్డి, ముత్యాలరెడ్డి, రామ్మూర్తి రాజు, శేఖర్‌, రామచంద్రయ్య, దేవరాల నిర్మల పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

గూడూరురూరల్‌: మున్సిపల్‌ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్‌ చేశారు. గూడూరులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు కల్పించాల్సిన అన్ని వసతులను ఇస్తామని గతంలో హామీ ఇచ్చారని అయితే ఇప్పటి వరకు మున్సిపల్‌ అధికారులు వాటిని నెరవేర్చడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని అన్నారు. వాటిని వెంటనే నెరవేర్చకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లాయ్య, సీనియర్‌ నాయకులు ఏ.పెంచలప్రసాద్‌, పద్మనాభయ్య, జోగి శివకుమార్‌, బీవీ రమణయ్య, అడపాల ప్రసాద్‌, మణి, లక్ష్మయ్య, ముకుంద పాల్గొన్నారు.

దాడి ఘటనలపై విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ రమణకుమార్‌

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలం పొలం విషయమై మన్నూరు గ్రామంలో జరిగిన ఘర్షణపై గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్‌ మన్నూరు దళితవాడలో ఆదివారం విచారణ చేశారు. బాధితులు మాట్లాడుతూ తమ గ్రామంలో గతంలో ఎప్పుడూలేని విధంగా జడపల్లి కోటేశ్వర రావుతో ఉద్దేశపూర్వకంగా ఘర్షణలు జరిగినట్లు ఆరోపించారు. పథకం ప్రకారం తమపై హత్యాయత్నానికి పాల్పడినట్లు డీఎస్పీ ముందు దళితులు వాపోయారు. దళితవాడలో పురుషుల ప్రాణాలకు భద్రత కల్పించాలని మహిళలు కోరారు. తమపై దాడి చేసిన ఆ గ్రామానికి చెందిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌ఐ గోపి, ఏఎస్‌ఐ మాల్యాద్రి పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ



శిక్షణ పొందిన కేడెట్లతో ఎన్‌సీసీ అధికారులు

కోట: విద్యానగర్‌ ఎన్‌బీకేఆర్‌ సైన్స్‌ అండ్‌ ఆర్ట్స్‌ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ 10ఏ నేవల్‌ యూనిట్‌ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ శిక్షణలో వివిధ కళాశాలల నుంచి 406 మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి క్యాంప్‌ కమాండెంట్‌ గణేష్‌ గొడుంగవే హాజరయ్యారు. ప్రిన్సిపల్‌ చంద్రశేఖర్‌ రెడ్డి, కో-ఆర్డినేటర్‌ రాజేష్‌ పాల్గొన్నారు.

వెంకటగిరి విద్యార్థినికి బంగారు పతకం



బంగారు పతకం అందుకున్న జాహ్నవి

వెంకటగిరిరూరల్‌: పట్టణంలోని కుమ్మరిమిట్టకు చెందిన పదవ తరగతి విద్యార్థి హెడ్డింగ్‌, డ్రాయింగ్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని అందుకున్నారు. అమీర్‌ ఆర్ట్స్‌ అకాడమీ నెల్లూరు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పట్టణంలోని సెంట్రల్‌ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని సీహెచ్‌సీ జాహ్నవి పాల్గొని ప్రతిభ కనబరిచారు. జాహ్నవికి నెల్లూరు టౌన్‌హాల్లో జరిగిన సమావేశంలో నారాయణ మెడికల్‌ కళాశాల డీన్‌ భాస్కర్‌రెడ్డి పతాకాన్ని అందజేశారు. ఈ మేరకు విద్యార్థినిని ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు ఈసందర్భంగా అభినందించారు.

భోజనం ప్యాకెట్ల అందజేత

దొరవారిసత్రం : నెలబల్లి గ్రామ పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన వృద్ధులు, చిన్నారులకు ఆదివారం తడ కండ్రిగ ప్రాంతానికి చెందిన శ్రీకృష్ణా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లను సంస్థ నిర్వాహకులు అందజేశారు. తడ గ్రామానికి చెందిన మురళీకృష్ణ, హేమ దంపతులు అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్‌ మీట్‌



బహుమతి ప్రదానం చేస్తున్న మోహన్‌

వరదయ్యపాళెం : కేంద్ర యువజన మంత్రిత్వశాఖ, చిత్తూరుకు చెందిన నెహ్రూ యువ కేంద్రం, స్వచ్ఛత్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన స్పోర్ట్స్‌ మీట్‌ కార్యక్రమం ఆదివారం వరదయ్యపాళెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉత్సాహంగా సాగింది. మండల వ్యాప్తంగా వివిధ క్రీడలకు సంబంధించి 32 జట్లు పాల్గొనగా స్వచ్ఛత్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ సంస్థ అధ్యక్షుడు మావుడూరు మోహన్‌ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్‌ పోటీలు హోరాహోరీగా సాగాయి. వాలీబాల్‌ విభాగానికి సంబంధించి చిలమత్తూరుకు చెందిన కెప్టెన్‌ ఎబినేచర్‌ పాల్‌ జట్టు మొదటి స్థానం సాధించింది. అలాగే కబడ్డీ పోటీల్లో వరదయ్యపాళెం దళితవాడకు చెందిన కెప్టెన్‌ రాజేష్‌ జట్టు ప్రథమ స్థానం సాధించింది. వీరికి సంస్థ అధ్యక్షుడు మావుడూరు మోహన్‌ రూ.5 వేల చొప్పున మొదటి బహుమతిని అందజేశారు.

వరదయ్యపాళెం, సంతవేలూరు హైస్కూళ్లకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు బందిలకుమార్‌, మనోహర్‌ క్రీడా పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆణిముత్యంరెడ్డి, భారత్‌ గ్యాస్‌ ఏజెన్సీ నిర్వాహకులు వెంకటేష్‌, బీజేపీ నాయకులు గుత్తి త్యాగరాజు, ఆధ్యాత్మిక గురువు నాగప్రసాద్‌, బాలకృష్ణ, రిటైర్డ్‌ ఉపాధ్యాయులు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

అంతా రెఫర్లే!

- రెఫర్‌ టూ తిరుపతి, నెల్లూరు
- ఇదీ ప్రభుత్వ ఆస్పత్రుల తీరు
- ప్రాథమిక చికిత్సకే సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు..
- వైద్యుల కొరతతో నామమాత్రపు వైద్యసేవలు.
- వెతలు ఎప్పుడు తీరుతాయో!



సీహెచ్‌సీ వైద్యశాల

సైదాపురం: అధునాతనమైన భవనాలు, ఆపరేషన్‌ థియేటర్లు ఉన్నా రోగులకు మాత్రం వైద్యం మాత్రం నామమాత్రంగా అందుతోంది. వైద్యశాలలో అత్యవసర విభాగం ఉన్నప్పటీ ప్రాథమిక చికిత్సకే పరిమితం చేస్తూ రెఫర్‌ టు తిరుపతి అంటూ వైద్యులు చేతులు దులుపుకుంటున్నారు. అలాగే డివిజన్‌ కేంద్రంలో ఉన్న మరో ఏరియా ఆస్పత్రిలో కూడా చిన్నపాటి గాయం తగిలినా కూడా రెఫర్‌ టూ నెల్లూరు అంటున్నారు ఇక్కడ వైద్యులు.. ఇటువంటి పరిస్థితి ఎక్కడో కాదు వెంకటగిరి సీహెచ్‌సీ వైద్యశాలతో పాటు డివిజన్‌ కేంద్రమైన గూడూరు ఏరియా వైద్యశాలలో గత చాలా కాలంగా కొనసాగుతున్న దుస్థితిపై సాక్షి ప్రత్యేక కథనం..

రెఫర్‌ టూ నెల్లూరు..

డివిజన్‌ కేంద్రమైన గూడూరు ఏరియా ఆస్పత్రిలో సిబ్బంది నామమాత్రంగానే విధులను నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చిన్నపాటి గాయం తగిలి ఆస్పత్రికి వస్తే ఆ రోగి పరిస్థితి ఇంతే..వెంటనే రెఫర్‌ టూ నెల్లూరు అని పంపిస్తుంటారు. ఏమైనా ప్రశ్నిస్తే ఆ రోగికి కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ పనిచేసే వైద్య సిబ్బంది రోగుల పాలిట శాపంగానే మారుతున్నారు. ఇందుకు ఇదే నిదర్శనం..ఇటీవల చిల్లకూరు బైపాస్‌ వద్ద చెన్నైకి చెందిన ఓ లారీ డ్రైవర్‌ గుండె నొప్పితో బాధపడుతుండడంతో లారీని అక్కడ నిలిపేసి సహచరులకు తెలియజేశారు. వారు వెంటనే హైవే అంబులెన్స్‌ సహాయంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ డ్రైవర్‌ తుదిశ్వాస విడిచాడు. దీంతో మృతదేహాన్ని మార్చురీలో ఉంచకుండానే ఏమర్జెన్సీ వార్డు వద్దనే వదిలేశారు. ఇతర ప్రాంతాల నుంచి రోగులు వచ్చినా సిబ్బంది సరైనా సమాధానం కూడా ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..

వెంకటగిరి సీహెచ్‌సీ వైద్యశాల నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో ఎక్కడా ఏ ప్రమాదం జరిగినా అత్యవర చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొస్తుంటారు. ఆ సమయంలో ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు సకాలంలో సరైన వైద్యం అందడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు కొందరు సీహెచ్‌సీ వైద్యశాలకు రావాలంటే భయపడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో గత ప్రభుత్వం నాణ్యమైన వైద్యం అందించే దిశగా వైద్యశాలలో మార్పులు తీసుకొచ్చారు. ఇందులోభాగంగా వెంకటగిరి సీహెచ్‌సీ 30 పడకల వైద్యశాల అయినప్పటికీ జనరల్‌, ఫిజియోథెరపీ, దంతవిభాగం, గైనకాలజిస్ట్‌ వంటి వైద్యులతో అన్ని రకాల రక్తపరీక్షలు వైద్యసేవలు అందించేవారు. అంతేగాకుండా ఫర్నిచర్‌, ఆధునిక పరికరాలను అందించింది. ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సీహెచ్‌సీ వైద్యశాలలో సిబ్బంది కొరత వల్ల పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. సీహెచ్‌సీ వైద్యశాలలో మొత్తం 8 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా జనరల్‌ సర్జరీ 01, గైనకాలజిస్ట్‌ 01, చిన్నపిల్లలు వైద్యులు 01, మత్తు వైద్యులు 01తోపాటు జూనియర్‌ అసిస్టెంట్‌లు ఇద్దరు చొప్పున ఖాళీలు ఉన్నాయి. మిగిలిన వైద్యుల్లో దంత విభాగం వైద్యులు మినహాయించగా కేవలం 3 మంది వైద్యులతో రోగులకు వైద్యసేవలు అందించాల్సి వస్తోంది. రోజుకు 250 నుంచి 300 మంది వైద్యశాలకు వస్తుంటారు. ఆక్రమంలో ఏదైనా ప్రమాదం జరిగి వైద్యశాలకొస్తే జనరల్‌ రోగులు వైద్యుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. రోగుల సంఖ్య పెరగడంతో పనిభారం వైద్యులకు పెరుగిపోతుండడంతో వైద్యులు చేసేదేమిలేకా రెఫర్‌ టూ తిరుపతి అంటున్నారు. కాగా గూడూరు ఏరియా ఆస్పత్రి పనితీరుపై కూడా ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



గూడూరు ఏరియా ఆస్పత్రి

నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నాం...



సీహెచ్‌సీ వైద్యశాలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రభుత్వ నిధులతో వైద్యశాలను ఆధునికీకరణ చేయడంతోపాటు ఉన్న వైద్యులను సమన్వయం చేసుకుంటూ వైద్యసేవలు అందిచడంలోపాటు సురక్షితమైన ప్రసవాలు చేస్తున్నాం.

జిలాని బాషా, సూపరింటెండెంట్‌ సీహెచ్‌సీ వైద్యశాల, వెంకటగిరి

కండలేరులో 57.228 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 57.228 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 210 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 520, లోలెవల్‌ కాలువకు 10, హైలెవల్‌ కాలువకు 110, మొదటి బ్రాంచ్‌ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను తింటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త శంకర్‌, తెలంగాణలోని వనపర్తి జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్‌ తెలిపారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలో సహజ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులతో పండించిన పంటల వలన వివిధ రోగాల బారిన పడుతున్నామన్నారు. అనంతరం పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రులు పాత్రపై అవగాహన కల్పించారు. యోగా గురువు సురేష్‌నాయుడు, రైతులు పాల్గొన్నారు.